క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

కల్వకుర్తి టౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించే వైద్య దినోత్సవంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం తెలిపారు. పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి ఆవరణలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని.. యువత, ఆసక్తి కలిగిన వారు అధికసంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

వెల్దండ: ఎక్సైజ్ అధికారులు మంగళవారం మండలంలో దాడులు నిర్వహించారు. కొట్రకు చెందిన గట్టు అంజమ్మ, శ్రీలక్ష్మి, మర్రిగుంటతండాకు చెందిన బుజ్జి వద్ద సారా పట్టుబడగా స్వాధీనం చేసుకొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ బేగంపేటకు చెందిన నరేందర్‌కుమార్ బొలెరో వాహనంలో కల్వకుర్తి వైపు 1,500 కిలోల నల్లబెల్లం, 200 కిలోల పటిక తరలిస్తుండగా పట్టుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురిపై కేసునమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు అధికారులు తెలిపారు. సారా విక్రయించినా, తయారుచేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం..

బల్మూర్: సారా తయారుచేసినా, విక్రయించినా పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ ఎస్‌ఐ బాలరాజు హెచ్చరించారు. మంగళవారం ఉదయం మండలంలోని పోలిశెట్టిపల్లి, గోపాల్‌నగర్‌తండా శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. గోపాల్‌నగర్‌తండాకు చెందిన రామకృష్ణ బైక్‌పై 7.5 లీటర్లు, పోలిశెట్టిపల్లికి చెందిన రాము 14 లీటర్ల సారాను తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో సిబ్బంది ఆంజనేయులు, ఆసిఫ్, నవీన్, పరమేష్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

లింగాల: మండల కేంద్రంతో పాటు సూరాపూర్, పద్మన్నపల్లిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సారా, బెల్లం ఊట పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. 17 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 550 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. సుల్తానమ్మ, శారద, లింగస్వామి, జానకిరాములుపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో మంగళవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాలుకాస్థాయి క్రికెట్ పోటీలను ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, చంద్రశేఖర్, సలేశ్వరం, బాలకృష్ణ, ప్రహ్లాద్, శంకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

చెరువు నీటి వృథాపై విచారణ



వెల్దండ: మండలంలోని చేదురుపల్లిలో ఉన్న తిరుపతి చెరువు తూము ద్వారా రాత్రిళ్లు గుర్తు తెలియని వ్యక్తులు నీటిని వదులుతుండటంతో మంగళవారం నీటిపారుదలశాఖ ఏఈ తిరుపతినాయక్ పరిశీలించారు. రైతుల ఫిర్యాదు మేరకు తూమును పరిశీలించామని.. చేపల కోసం నీటిని వదిలేస్తున్నట్లు వివరించారు. నీటి వృథాకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

పేద రైతులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



పెద్దకొత్తపల్లి: ధరణి సమస్యతో పేద రైతుల భూములను తక్కువ ధరకే బీఆర్‌ఎస్ నాయకులు కొనుగోలు చేసి పేర్లు మార్చుకుంటున్నారని.. సరికాదని బీజేపీ మండలాధ్యక్షుడు భీమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి పేద రైతులకు న్యాయం చేయాలని.. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుమల్, శివ, విష్ణు, రాము, శివ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

● కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాలకు చెందిన 214 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే 155 మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు రూ.6.12 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని.. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషియన్ కిట్లు, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి, స్త్రీనిధి రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను మహిళల కోసం అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ఏర్పాటు చేశామని వివరించారు. ఆర్డీఓ హనుమానాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు కేసిరెడ్డి వెంకటరమణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్లు పెబ్బేటి కృష్ణయ్య, కట్టా రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలు ఆర్థికాభివృద్ధి సాధించాలి..

కోడేరు: గొల్ల కురుమలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాయిపల్లిలో రెండోవిడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గొర్రెలు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పశువైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి గొల్ల కురుమలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రమేష్, సర్పంచ్ సత్యనారాయణయాదవ్, ఉపసర్పంచ్ ఈశ్వర్, డా. భానుకిరణ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, గాలియాదవ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి



అచ్చంపేటలో కరపత్రం విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ బాలరాజు, డీఎఫ్‌ఓ

● ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందని, వారికి అండగా ఉంటున్నామని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో అమ్మ ఒడి, ఆరోగ్యలక్ష్మి పథకాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. మహిళలు, యువతుల భద్రతకు షీటీం, భరోసా, సఖి కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళ, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, ఎంపీపీ శాంతాబాయి, సీడీపీఓలు దమయంతి, లక్ష్మి, కమల, బిపాషా, నాయకులు సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేదరులను ఆదుకుంటాం..

మేదరులను ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యేను మేదర కులవృత్తిదారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులవృత్తిదారులకు సీఎం కేసీఆర్ రూ.లక్ష ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మేదర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రమాకాంత్, కొండలయ్య, రాము, శ్రీశైలం, శేఖర్, ఈశ్వరయ్య, వెంకటేష్, మంజుల, పావని, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



కొల్లాపూర్: స్థానిక ఆర్టీసీ బస్‌డిపో గేటు ఎదుట మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిమాండ్స్ డేను పురస్కరించుకొని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్మిక సంఘం నాయకులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం డిపో కార్యదర్శి మధుసూధన్ మాట్లాడుతూ.. 2017, 2021 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పేస్కేల్స్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని, సీసీఎస్ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, కిష్టయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



పెంట్లవెల్లి: జీఓనంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వర్‌తో కలిసి ఎంపీడీఓ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో ఆదాయం ఉన్నా ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని, పీఆర్సీలో నిర్ణయించిన కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 21 తర్వాత సమ్మెకు వెళ్తామని వివరించారు. కార్యక్రమంలో చిట్టెమ్మ, శ్రీనివాసులు, గంగులు, ఈశ్వర్ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే పింఛన్ పెంపు



మాట్లాడుతున్న పుల్జాల బాలీశ్వర్

నాగర్‌కర్నూల్ రూరల్: ఎన్‌పీఆర్‌డీ పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.వెయ్యి పెంచిందని.. దివ్యాంగుల రోస్టర్ 10లోపు తగ్గించే వరకు పోరాటం చేస్తామని ఎన్‌పీఆర్‌డీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పుల్జాల బాలీశ్వర్ తెలిపారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరల పెంపునకు అనుకూలంగా పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా దశల వారీగా పోరాటాలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటన తమను గందరగోళానికి గురిచేసేలా ఉందని.. నామమాత్రంగా పెంచి చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. రూ.4,116తో కుటుంబ పోషణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఎన్నికల ముందు పింఛన్ పెంచి ఓట్లు పొందేందుకు ముఖ్యమంత్రి ప్రకటన దోహదం చేస్తుందని.. పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు వెంకటయ్య, బాలస్వామి, దశరథం, జంగయ్య, జగదీశ్, బండపల్లి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బల్మూర్: మండలంలోని పొలిశెట్టిపల్లిలో సోమవారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని ఓ ఇంటి సమీపంలో ఉన్న చెట్టుకింద పేకాట ఆడుతుండగా.. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు వివరించారు. వీరి నుంచి రూ.1,530 పట్టుబడిందని తెలిపారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

కందనూలు: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నేత తల్లోజు ఆచారి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పూర్వ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ కార్యకర్తల అనుభవం, సలహాలు పార్టీకి పునాదులన్నారు. రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయడానికి క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి, జిల్లా ప్రధానకార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, వివిధ మండలాల, మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కంచె ధ్వంసం.. కేసు నమోదు

ఉప్పునుంతల: పొలానికి వేసిన కంచెను ధ్వంసం చేసిన కేసులో ఎనిమిది మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని మర్రిపల్లికి చెందిన మొల్గర ఉమాదేవి తన వ్యవసాయ పొలం చుట్టూ వేసిన 200 కడీలను గ్రామానికి చెందిన పచ్చిపాల సురేష్, శ్రీనయ్య, బాలమ్మ, రమేష్, సత్యమయ్య తదితరులు మొత్తం ఎనిమిది మంది ధ్వంసం చేయడమేగాక దుర్భషలాడారని.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు వివరించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ప్రచారాలు ఆపాలి



డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ప్రచారాలు జోరందుకున్నాయని.. టెక్నో, ఈ–టెక్నో, ఇంటర్నేషనల్ పేర్లతో మోసాలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ మంగళవారం డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ రూ.వేలు దోచుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, నాయకులు రామకృష్ణ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



దివ్యాంగుడికి మిఠాయి తినిపిస్తున్న సురేష్‌గౌడ్

కల్వకుర్తి రూరల్: దివ్యాంగుల పింఛన్ రూ.4,116కు పెంచడాన్ని హర్షిస్తూ మంగళవారం మండలంలోని తర్నికల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు, దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు సురేష్‌గౌడ్ దివ్యాంగులకు మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి



వ్యాపార సముదాయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కల్వకుర్తి టౌన్: పురపాలికలో వ్యాపారాలు నిర్వహించే దుకాణదారులు విధిగా ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని దుకాణాలను తనిఖీచేసి ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలించారు. లైసెన్స్‌లు తీసుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నూతన నిర్మాణాలు చేపట్టి పూర్తయిన వారు విధిగా సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట బిల్ కలెక్టర్ చంద్రయ్య, సిబ్బంది శివ, నర్సింహ, నజీర్, శ్రీధర్ ఉన్నారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీలు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ మార్క్‌పోలోనియస్

కొల్లాపూర్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 'తెలంగాణ ఉద్యమం.. రాష్ట్ర ఆవిర్భావం' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ పీజీ కళాశాలలో మంగళవారం ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ కోర్సులకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. మార్క్‌పోలోనియస్ తెలంగాణ సాధనకు జరిగిన పోరాటాలు.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాతి పరిణామాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకే పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలను అధ్యాపకులు పుట్టా శ్రీనివాసులు, శిరీష తదితరులు పర్యవేక్షించారు.

రైతులను మోసగించడం సరికాదు : కాంగ్రెస్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చారకొండ: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే నిర్వాహకులు అవకతవకలకు పాల్పడుతూ మోసం చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తూకం ప్రకారం రైతులకు అందించిన రసీదులో డబ్బుల వివరాలు నమోదు చేయాలని, తూకం తర్వాత మిల్లర్ల వద్ద బస్తాకు నాలుగు కిలోల చొప్పున కోత విధించడం దారుణమన్నారు. రైతులను మోసం చేస్తే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, నర్సింహారెడ్డి, అంజయ్య, శంకర్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుకాలనీలో వైద్య శిబిరం



జంగంరెడ్డిపల్లి చెంచుకాలనీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

అమ్రాబాద్: మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఐటీడీఏ సహకారంలో మండలంలోని జంగంరెడ్డిపల్లి చెంచుకాలనీ, కొల్లంపెంట, కొమ్మెనపెంటలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి చెంచులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 57 మందిని పరీక్షించి సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శ్రీవాణి, ఖుద్దూస్, డివిజన్ మలేరియ అధికారి అశోక్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు'లో మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి



అంబేడ్కర్ చౌరస్తాలో చెన్నయ్యకు స్వాగతం పలుకుతున్న నాయకులు

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న దళితబంధు పథకంలో మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలని, 30 లక్షలకుపైగా ఓటర్లున్న మాలలను ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని టీఎన్‌జీఓ భవనంలో మాల మహానాడు డివిజన్‌స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీవీరావు ఆశయాలు, అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. మాలలు సంఘటితంగా ఉండాలని.. సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపొద్దని కోరారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్య, నాసరయ్య, దివాకర్, బాలకిష్టయ్య, భాస్కర్, శ్రీశైలం, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి : కేవీపీఎస్



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్ రూరల్: పేదలందరికి ఇళ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా సమావేశం జరగగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించిన ప్రభుత్వం నేటికీ పంపిణీ చేయడం లేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ఇళ్ల స్థలాల పంపిణీ జీఓను ప్రభుత్వం రద్దు చేసిందని.. వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో అధికారులు ఇళ్ల పట్టాలిచ్చి తిరిగి తీసుకుంటున్నారని.. సరైంది కాదన్నారు. జిల్లాలో వందల ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం కింద అర్హులకు రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు పర్వతాలు, ఆర్.శ్రీనివాస్, కందికొండ గీత, దేశ్యానాయక్, నర్సింహ, శివవర్మ, కాశన్న, బాలీశ్వర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి నాగంపై ఫిర్యాదు



ఫిర్యాదు అందజేస్తున్న వల్లభ్‌రెడ్డి తదితరులు

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీని నాగం జనార్ధన్‌రెడ్డి ఆగం చేస్తున్నారని పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం టీపీసీసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నిరంజన్, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ ఇచ్చిన నిబంధనలను కాలరాస్తూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఇష్టమైన వారిని పిలిపించుకొని నియోజకవర్గ కమిటీలు వేశారని.. వెంటనే రద్దు చేసి కొత్త కమిటీలు వేయాలని కోరారు. కమిటీలు రద్దు చేయకపోతే గాంధీభవన్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు వల్లభ్‌రెడ్డి, అనిల్, సుహాసన్‌రెడ్డి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి

వెల్దండ: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి సకాలంలో విధులకు హాజరుకావాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్ కోరారు. మంగళవారం మండలంలోని దేసీగానితండా ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో 45 శాతం పుస్తకాలు వచ్చాయని.. మిగిలిన పుస్తకాలు త్వరలోనే అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంఐఎస్ బాలయ్య, చంద్రశేఖర్, ఆంజనేయులు, అంజ్యానాయక్ పాల్గొన్నారు.

మన ఊరు – మన బడి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి నూరోద్దీన్

కందనూలు: మన ఊరు–మన బడికి ఎంపికైన పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను మంగళవారం సెక్టోరియల్ అధికారి నూరోద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఊరు–మన బడికి శ్రీపురం, నాగనూల్ ప్రాథమిక పాఠశాలలతో పాటు తూడుకుర్తి ఉన్నత పాఠశాల ఎంపికయ్యాయని చెప్పారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో డీఈఓ గోవిందరాజులు ఆదేశాల మేరకు మరమ్మతులు ఎంతవరకు వచ్చాయి.. పనుల నాణ్యతను పరిశీలించినట్లు వివరించారు. పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ..

తాడూరు: స్థానిక ఎమ్మార్సీ భవనంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను వివరించాలని సూచించారు.

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్య పుస్తకాలను మంగళవారం ఎంపీపీ కొమ్ము మధు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం 70 శాతం పాఠ్య పుస్తకాలు వచ్చాయని, రెండురోజుల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తామన్నారు. రైతుబంధు మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, కరుణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలి..

ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సరిపడా పాఠ్య పుస్తకాలతో పాటు రాత పుస్తకాలు అందించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జక్క రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడిబాటలో తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తే సరిపడా పాఠ్య పుస్తకాలు అందలేదని.. ఇప్పటి వరకు కేవలం 50 శాతం పుస్తకాలు మాత్రమే రాగా.. రాత పుస్తకాలు, వర్కింగ్ బుక్స్ రాలేదని తెలిపారు.